క్లుప్తంగా

వాహనాల వేలం



వాహనాలను వేలం వేస్తున్న పోలీసు అధికారులు

బంగారుపాళెం: మండలంలో అక్రమ మద్యం కేసులో స్వాధీనం చేసుకున్న వాహనాలను శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో వేలం వేసినట్లు సీఐ నాగరాజరావు తెలిపారు. వేలంలో 2,32,820 రూపాయల ఆదాయం వచ్చిందన్నారు. చిత్తూరు అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఆయేషాబేగం ఆధ్వర్యంలో మూడు ద్విచక్రవాహనాలు, రెండు కార్లను బహిరంగ వేలం వేసినట్లు తెలిపారు. ఎస్‌ఐ రాంభూపాల్, ఏఎస్‌ఐ మల్లప్ప, హెడ్‌కానిస్టేబుల్ గజేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం సీజ్

చిత్తూరు అర్బన్: కర్ణాటక మద్యం కలిగివున్న ఓ వ్యక్తిని చిత్తూరు రూరల్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) పోలీసులు శనివారం అరెస్టు చేశారు. సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ మోహన్‌బాబు తమ సిబ్బందితో కలిసి బంగారుపాళ్యం మండలంలో తనిఖీలు చేశారు. ఎగువ రాగిమానుపెంట గ్రామంలో 79 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు కలిగివున్న ఢిల్లీ ప్రసాద్ (35) ను అరెస్టు చేశారు. నిందితుడిని కోర్టుకు హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారు.

విద్యార్థులకు ఉచితంగా బస్ పాసులు



విద్యార్థులకు బస్‌పాసులను అందజేస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులు

గుడిపాల: మండలంలోని నరహరిపేట జెడ్పీ హైస్కూల్‌లో 252మంది విద్యార్థులకు గురజాల చారిటబుల్ ఫౌండేషన్ ఆర్టీసీ బస్ పాసులను ఉచితంగా అందజేసింది. ఫౌండేషన్‌కు చెందిన జగన్‌మోహన్ తరఫున ఆయన తండ్రి చెన్నకేశవనాయుడు పాసులతోపాటు పెన్నులను పంపిణీ చేశారు. ఆర్టీసీ–2 డిపో మేనేజర్ రూప, ఆర్టీసీ కంట్రోలర్లు రామ్మూర్తి, ఎన్‌టి నాయుడు, చిరంజీవి, రాజు, చంద్ర, ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ



పుస్తకాలను అందజేస్తున్న ఎంఈఓ, దాతలు

ఐరాల: దాతల వితరణను సద్వినియోగం చేసుకుని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా చదువుల్లో రాణించాలని ఎంఈఓ వేణుగోపాల్ రెడ్డి అన్నారు. మండలంలోని 35 యర్లంపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన వాసు ట్రస్ట్ నిర్వాహకులు రాజారాం, ఈశ్వర్ రూ.10 వేలతో విద్యార్థులకు పలకలు, నోట్‌పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, కాపీ రైటింగ్ పుస్తకాలను శుక్రవారం ఎంఈఓ, అదనపు ఎంఈఓ దామోదర్‌నాయుడుతో కలిసి విద్యార్థులకు అందజేశారు. ప్రతి ఏటా విద్యార్థులకు వాసు ట్రస్ట్ విద్యాసామగ్రిని ఇవ్వడం అభినందనీయమని ఎంఈఓలు అన్నారు. హెచ్‌ఎం అజిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దాబాల్లో అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



దాబా నిర్వాహకులతో మాట్లాడుతున్న సీఐ

బంగారుపాళెం: దాబాల్లో ఆహార పదార్థాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని సీఐ నాగరాజరావు నిర్వాహకులను హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని దాబా హోటళ్ల నిర్వాహకులకు సీఐ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, దాబాల నిర్వాహకులు ఆహార పదార్థాలను ఇష్టం వచ్చినట్లు విక్రయించి, ప్రయాణికులను మోసం చేస్తే చర్యలు తప్పవన్నారు. దాబాల ముందు ధరల పట్టికను పెట్టాలని ఆదేశించారు. దాబాలలో అక్రమంగా మద్యం విక్రయించడం, తాగించడం చేసినా చర్యలు తప్పవన్నారు. రాత్రి 10 గంటల తర్వాత దాబాలు, హోటళ్లను నిర్వహించారని, విధిగా సీసీ కెమెరాలను అమర్చుకోవాలని సూచించారు.

యాప్‌లో ఎప్పటికప్పుడు వివరాల నమోదు

యాదమరి: గ్రామాలలోని రోగుల వివరాలు ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఎప్పటికప్పుడు ఆశ యాప్‌లో నమోదు చేయాలని యాదమరి ప్రభుత్వ వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఏఎన్‌ఎంలకు, ఆశా కార్యకర్తలకు సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీ నారాయణ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పాడి రైతులకు వెలుగు చుక్క జగనన్న

- సీఎం పర్యటన విజయవంతం చేద్దాం
- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

పూతలపట్టు(యాదమరి): పాడి రైతుల జీవితాలలో వెలుగు చుక్క జగనన్న అని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. శుక్రవారం సాయంత్రం చిత్తూరు సమీపంలోని పూతలపట్టు నియోజక వర్గ ఎమ్మెల్యే కార్యాలయంలో ఐదు మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులకు సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఈ నెల 4న మంగళవారం చిత్తూరులో పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విచ్చేస్తున్నారని, ఆయన పర్యటనను నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, నాయకులు, అభిమానులు అందరూ కలసి విజయవంతం చేయాలని కోరారు. అలాగే 2002లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన సొంత హెరిటేజ్ పాల డెయిరీ కోసం చిత్తూరులో ఉన్న విజయ డెయిరీని స్వార్థ ప్రయోజనాలతో మూసివేసి నిర్వీర్యం చేశారన్నారు. దీంతో పాడి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. డెయిరీని తెరవాలని పాడి రైతులు ధర్నా, ఆందోళన చేసినా టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఆ తర్వాత పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే విజయ డెయిరీని పునఃప్రారంభానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారన్నారు. విజయ డెయిరీని 4న సీఎం ప్రారంభించనుండడంతో చిత్తూరు టీడీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరుగులు తీస్తున్నాయని అపహాస్యం చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు రామచంద్రారెడ్డి, బుజ్జి రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సిద్ధంపల్లె హరిరెడ్డి, కాణిపాక ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, తవణంపల్లె ప్రకాష్ రెడ్డి, రాజారత్నం రెడ్డి, సుధాకర్ రెడ్డి, పరమేశ్వర రెడ్డి, లోకేశ్వర్ రెడ్డి, కుమార్ రాజా పాల్గొన్నారు.

జగనన్నతోనే మాకెంతో లబ్ధి

తవణంపల్లె: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుణ్యమా అని తమ కుటుంబాలకు ఎంతో లబ్ధి కలిగిందని, తద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆనందంగా జీవిస్తున్నామని పలువురు లబ్ధిదారులు పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు నివేదించారు. శుక్రవారం ఆయన మండలంలోని పల్లెచెరువు, పల్లెచెరువు దళితవాడ, మైలవారిపల్లె, జెట్టిపల్లె గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. సంక్షేమ పథకాల లబ్ధి పొందుతున్నారా? అని ఆరా తీసినప్పుడు పలువురు పైవిధంగా స్పందించారు. జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటామని, వచ్చే ఎన్నికల్లోనూ ఆయననే గెలిపిస్తామని చెప్పారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ, అర్హులందరికీ పథకాల ఫలాలు అందించడమే జగనన్న లక్ష్యమన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇంటిపట్టాలు, పక్కాగృహాలు మంజూరు చేయాలని, సీసీ రోడ్లు వేయాలని, మురుగు కాలువలు నిర్మించాలని, కరెంటు స్తంభాలు ఏర్పాటు చేయాలని ప్రజలు ఎమ్మెల్యేను కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. అనంతరం మడవనేరి సమీపంలోని మూలస్థానమ్మ గుడి ఉత్సవాల్లో అమ్మ వారికి ఎమ్మెల్యే పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్, భూరీసర్వే డీటీ వెంకటరమణ, సర్పంచ్ లావణ్య, వివిధ శాఖల అధికారులు, మండల సచివాలయ కన్వీనర్ హరికృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ పట్నం ప్రతాప్ రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ హరిరెడ్డి, పార్టీ నాయకులు సుజిత్‌రెడ్డి, గఫూర్‌సాహెబ్, మునస్వామినాయుడు, తబూర్ కలీం, గృహసారథులు, పంచాయతీ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు కారకాంపల్లె పంచాయతీలో..

కారకాంపల్లె పంచాయతీలో శనివారం ఉదయం 6.30 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహిస్తారని ఎంపీపీ గీతారెడ్డి, ఎంపీడీఓ తెలిపారు.

హనుమంతు వాహనంపై శ్రీరామచంద్రుడి చిద్విలాసం

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరు కోదండ రాముల దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి హనుమంతు వాహనంపై శ్రీరామచంద్రుడు కొలువుదీరి భక్తులకు కటాక్షించారు. తొలుత ఉభయదారులు స్వామికి పూజాసామగ్రి, ప్రసాదాలు, గజమాలలు ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. ఉదయం స్వామికి ఉభయదారులు తిరుమంజనం, పాలాభిషేకం చేశారు. సాయంత్రం ఉభయదారులు ఉయ్యాలసేవను నిర్వహించారు. అర్చకులు ఉత్సవమూర్తి శ్రీరామచంద్రుడికి అభిషేకం, పూజలు నిర్వహించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. శనివారం శేషవాహన సేవ నిర్వహించనున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సిద్ధేశ్వర రెడ్డి తెలిపారు.

ఎగువమారేడుపల్లెలో 'ఫ్యామిలీ డాక్టర్'



ఎగువ మారేడుపల్లెలో..



గుడిపాల: చింతగుంటూరులో..

తవణంపల్లె: మండలంలోని ఎగువ మారేడుపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర ప్రియాంక రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. శనివారం టి.పుత్తూరు, పైమాఘంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

చింతగుంటూరులో..

గుడిపాల: రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌తో ప్రజల ఇంటి వద్దకే వైద్యం వస్తోందని డాక్టర్ రష్మిత అన్నారు. శుక్రవారం మండలంలోని చింతగుంటూరులో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. రోగులకు డాక్టర్ రష్మిత వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అలాగే ఆరోగ్యశ్రీ కింద శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్యం ఎలా ఉందో ఆరా తీశారు. వైద్య సిబ్బంది శాంతకుమారి, ప్రియాంక, వనజ, భాస్కర్, సుజాత, కోకిల పాల్గొన్నారు.

ఉపాధి హామీలో సమస్యలేంటి?



బహిరంగ సభలో తనిఖీ వివరాలను అడిగి తెలుసుకుంటున్న అధికారులు

చిత్తూరు రూరల్: ఉపాధి హామీ పనుల్లో ఎందుకు సమస్యలొస్తున్నాయని వాటర్ షెడ్ అడిషనల్ పీడీ ఉమావాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. చిత్తూరు మండలంలో శుక్రవారం ఉపాధి హామీ బహిరంగ సభ నిర్వహించారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలో హౌసింగ్, పీఆర్, ఉపాధి హామీ పథకం కింద 1,296పనులు చేశారు. ఇందుకు గాను ప్రభుత్వం రూ.4.66కోట్లు వ్యయం చేసింది. దీనిపై ఉపాధి హామీ తనిఖీ బృందం వారం రోజులుగా క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసింది. లోటుపాట్లను గుర్తించిన తనిఖీ బృందం బహిరంగ సభలో వెల్లడించింది. గుంతలు పూడిపోయాయని, చెట్లు చనిపోయాయని, సమాచార బోర్డులు లేవని, లెక్కల్లో తప్పిదాలు ఉన్నాయని పలువురు క్షేత్రసహాయకుల మండిపడ్డారు. రూ.19.872 రికవరీకి ఆదేశించారు. ఇకపై తప్పిదాలు చోటుచేసుకుంటే సహించేది లేదని హెచ్చరించారు. ప్రధానంగా కూలీల సంఖ్య తక్కువగా ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారిణి భాగ్యలక్ష్మి, ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, ఎస్‌ఆర్‌పీ రవి, క్లస్టర్ ఏపీడీ సుబ్రమణ్యం, ఏపీఓ చిన్నరెడ్డమ్మ తదితరులు పాల్గొన్నారు.

మామిడి మద్దతు ధరపై హర్షం

చిత్తూరు కలెక్టరేట్ : మామిడి రైతులను ఆదుకునేందుకు గిట్టుబాటు ధర ప్రకటించడం ఆనందంగా ఉందని బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ చైర్మన్ సోమశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన పలు అంశాలను కలెక్టర్ షణ్మోహన్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మామిడి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటోందన్నారు. మద్దతు ధర కిలో రూ.12 ప్రకటించి రైతులను ఆదుకుంటోందన్నారు.

మూలస్థానమ్మ గుడిలో పూజలు

తవణంపల్లె: మండలంలో మడవనేరి సమీపంలోని పురాతన ఆలయంలో శుక్రవారం భక్తులు విశేష పూజలు చేశారు. మడవనేరి, ఎం.కృష్ణాపురం, వడ్డపల్లె గ్రామస్తులు అమ్మ వారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు చేసి మొక్కులు చెల్లించారు. భక్తులకు అన్నదానం చేశారు.

నేడు జగనన్న సురక్ష గ్రామసభ

బంగారుపాళెం: స్థానిక గ్రామ సచివాలయం–1లో శనివారం జగనన్న సురక్ష గ్రామసభ నిర్వహించనున్నట్లు సర్పంచ్ ఉమాదేవి, గ్రామ సచివాలయ కార్యదర్శి శంకరయ్య తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభం అయ్యే కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు హాజరు కానున్నట్లు తెలిపారు. గ్రామ సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకున్న ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలు ఉచితంగా ఇవ్వనున్నట్లు చెప్పారు.

వరసిద్ధుని సేవలో టెక్కలి ఎమ్మెల్యే

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయకస్వామిని శ్రీకాకుళం జిల్లా టెక్కలి శాసనసభ్యులు అచ్చెంనాయుడు శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ ఏఈఓ రవీంద్రబాబు ఆయనకు స్వాగతం పలికారు. దర్శనానంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలికారు.

గుడిపాలలో 'పొలంబడి'



చేనులో పరిశీలిస్తున్న మాధవి

గుడిపాల: ఆధునిక పద్ధతుల్లో పంటలు సాగు చేసి అధిక దిగుబడి సాధించాలని వ్యవసాయాధికారి మాధవి కోరారు. శుక్రవారం గుడిపాలలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, వేరుశనగ విత్తనాలను శుద్ధి చేసి విత్తుకోవడం వల్ల మంచి దిగుబడి పొందవచ్చన్నారు. అలాగే వేరుశనగతో పాటు కందిని అంతర పంటగా సాగుచేయడంతో పాటు పొలం చుట్టూ జొన్న పంటను వేసుకోవచ్చన్నారు. రైతులు తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకుని తదనుగుణంగా ఎరువులు వాడాలని సూచించారు.